ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
బుధవారం | 17 జూన్ , 2026 | పేజీలు : 05



## వార్షిక బ్రహ్మోత్సవాలకు మంత్రికి ఆహ్వానం

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** కనగల్ మండలం ధర్వేశిపురంలో ఈ నెల 23 నుంచి 25 వరకు జరిగే శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా 24న జరిగే అమ్మవారి కల్యాణోత్సవానికి రావాలని కోరుతూ ఆలయ కమిటీ చైర్మన్, పాలకవర్గ సభ్యులు మంగళవారం హైద రాబాద్ లో రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వార్షిక బ్రహ్మోత్సవాల జాతర పోస్టర్ మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించారు.

# పెంచిన ఎరువులు, క్రిమిసంహారక మందుల ధరలను వెంటనే తగ్గించాలి

### రైతు సంఘం డిమాండ్




**ప్రజాపక్షం/భువనగిరి :** పెంచిన ఎరువుల ధరలను క్రిమిసంహారక మందులను వెంటనే తగ్గించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ అన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా కౌన్సిల్ సమావేశం రైతు సంఘం నాయకులు పేరబోయిన బంగారి అధ్యక్షతన మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎస్వి హోటల్లో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ హాజరై ప్రసంగిస్తూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రైతాంగానికిఅవసరమయ్యే ఎరువుల ధరలను విపరీతంగా పెంచడంతో వ్యవసాయం చేసే రైతులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని వెంటనే ఎరువుల ధరలను కేంద్ర ప్రభుత్వం తగ్గించాలని ఆమె డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రైతాంగం పట్ల సవతి తల్లి ప్రేమ కనబరుస్తుందని రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర నామమాత్రంగానే పెంచినారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగ సమస్యలపై కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఆమె కోరారు. అలాగే మదర్ డైరీలో పాలు పోసిన పాల రైతులకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించే విధం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. రైతు రుణమాఫీ రైతుబంధు చాలామంది రైతులకు అమలు కాలేదని వెంటనే రైతాంగానికి అమలు అయ్యే విధంగా సంబంధిత అధికారులు చొరవ చూపాలన్నారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లూరు రాజయ్య మాట్లాడుతూ రైతాంగ సమస్యలు పరిష్కరించడంలో రైతు సంఘం నాయకులు కార్యకర్తలు క్రియాశీలకంగా పనిచేయాలని కోరినారు. అలాగే సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక రైతాంగ సమస్యలపై ఎక్కడికక్కడ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించాలని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై రైతాంగాన్ని చైతన్యం చేసి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి చెడే చంద్రయ్య, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఏషాల అశోక్, ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేష్, యువజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పేర బోయిన మహేందర్, రైతు సంఘం నాయకులు జక్కా దయాకర్ రెడ్డి, ఎలగందుల అంజయ్య, ఉప్పుల కొమరయ్య, పల్లె మల్లారెడ్డి, మొగుళ్ళ తిరుపతిరెడ్డి, సుదర్శన్ రెడ్డి, దాసరి లక్ష్మయ్య, తెడ్డు ఆంజనేయులు, లింగారెడ్డి, సురేందర్ రెడ్డి, యాదయ్య, రాజప్ప పాల్గొన్నారు.



## ప్రజల సమస్యల పరిష్కారంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

### నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్

**ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్ :** ఫారెస్ట్, రెవిన్యూ భూముల సమస్యలు త్వరగా పరిష్కరించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం ఆయన తిరుమలగిరి సాగర్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫారెస్ట్ భూములు, రెవిన్యూ భూములకు సంబంధించిన సమస్యలు ఏవైనా పెండింగ్‌లో ఉంటే వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని ఫైళ్లను పరిశీలించి,ఫారెస్ట్ భూములు, రెవిన్యూ భూములకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు.భూముల యాజమానులు, సరిహద్దులు,గెజిట్ నోటిఫికేషన్లు, సంబంధిత పత్రాలు సక్రమంగా ఉన్నాయా లేదా అనే అంశాలపై అధికారుల నుండి వివరాలు తెలుసుకున్నారు. ఫారెస్ట్ , రెవిన్యూ శాఖల మధ్య ఉన్న భూవివాదాలు, ఇతర సమస్యలు ఏమైనా ఉంటే వాటిని ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని సూచించారు.అలాగే భూ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించి,ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యాలయంలోని పలు విభాగాల పనితీరును పరిశీలించిన కలెక్టర్, ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ఈ తనిఖీలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి, జిల్లా ఫారెస్ట్ అధికారి రాజశేఖర్, తహసిల్దార్ అనిల్ కుమార్ కలెక్టర్ వెంట ఉన్నారు.

# ప్రజలకు మెరుగైన సేవ చేయడమే లక్ష్యం

### మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు మున్సిపల్ పాలక మండలి కట్టుబడి పనిచేస్తోందని సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశ ప్రారంభంలో రాష్ట్రస్థాయిలో ఉత్తమ పర్యావరణ పరిరక్షణ అవార్డు అందుకున్న సందర్భంగా చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, మున్సిపల్ కమీషనర్ హన్మంత రెడ్డిలను సభ్యులు అభినందించారు. అనంతరం అజెండాలో పొందుపరిచిన 12 అంశాలను చర్చించి ఆమోదించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, మౌళిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం జరిగిన జీరో అవర్‌లో కౌన్సిలర్లు తమ తమ వార్డుల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులపై సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పబ్లిక్ హెల్త్ డిఈ రమాదేవిపై పలువురు కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పనుల్లో వేగం, పర్యవేక్షణ పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా 37వ వార్డు కౌన్సిలర్ బైరు శైలేందర్ మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్టర్లు చేపడుతున్న పనుల్లో నాణ్యత ఉండాలని, అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. 38వ వార్డు కౌన్సిలర్ గండూరి రమేష్ మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. 42వ వార్డు కౌన్సిలర్ అంగిరేకుల నాగార్జున మాట్లాడుతూ యూజిడి కోసం తవ్విన గుంతలు ఆరు నెలలు పూర్తయినా పునరుద్ధరణ జరగలేదని, ప్రజలు రాకపోకల్లో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కౌన్సిలర్లు ఫోన్లు చేసినప్పుడు అధికారులు స్పందించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. 40వ వార్డు కౌన్సిలర్ కొణతం రాజేష్ మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనుల్లో సాంకేతిక ప్రమాణాలు పాటించడం లేదని, ప్రణాళిక లేకుండా మ్యాన్‌హోల్స్ తొవ్వుతున్నారని విమర్శించారు. 35వ వార్డు కౌన్సిలర్ జ్యోతి శ్రీవిద్య మాట్లాడుతూ మొదటి విడతలో చేపట్టిన యూజిడి పనుల అనంతరం రోడ్ల పునరుద్ధరణ సరిగా జరగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. 48వ వార్డు కౌన్సిలర్ వెలుగు వెంకన్న మాట్లాడుతూ తమ వార్డు పూర్తిగా వాణిజ్య ప్రాంతమని, యూజిడి పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. 47వ వార్డు కౌన్సిలర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో నిరుపేదలకు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ యండి షఫీఉల్లా, మున్సిపల్ ఇఇ కిరణ్, డిఇ ప్రణయ్ కుమార్, టిపిఓ సోమయ్య, మేనేజర్ బుచ్చిబాబు, ఆర్ఓ కళ్యాణి, పబ్లిక్ హెల్త్ డిఇ రమాదేవి, అనిల్, యండి గౌసుద్దీన్, ఎస్ఎస్ఆర్ ప్రసాద్, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి కృషి : గుప్త

**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** శ్రీలింగమంతుల స్వామి చౌడమ్మ తల్లి పెద్దమ్మ తల్లి దేవాలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్ గుప్త అన్నారు. మంగళవారం ఆయన చౌడమ్మ తల్లి లింగమంతుల స్వామి పెద్దమ్మ తల్లి ఆలయాన్ని దర్శించారు. ఆలయ కమిటి సభ్యులు గట్టు శ్రీనివాస్ గుప్తకు సాదరంగా స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే శ్రీలింగమంతుల స్వామి, చౌడమ్మ తల్లి జాతరకు గ్రామం నుంచే కాకుండా పరిసర గ్రామాల నుంచి చుట్టు పక్కల మండలాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో వస్తున్న యాదవులకు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ లింగమంతుల స్వామి ఆశీస్సులతో ఈ ప్రాంతం పాడి పంటలతో అభివృద్ధి చెందాలన్నారు.ఆలయ అభివృద్ధి కోసం, మౌళిక వసతుల కల్పనకు తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి సహకారంతో ఆలయ పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు జాల మాణిక్యం, జాల జానకిరాములు, లొడంగి సోమయ్య, జాల వెంకన్న, జాల నర్సయ్య, జాల జానయ్య, జాల సైదులు, గ్రామ వార్డు మెంబర్లు పాల్గొన్నారు.



## తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడిగా వెంకటేశం

**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండల కేంద్రానికి చెందిన బూరుగు వెంకటేశంను తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులుగా నియమిస్తూ ఈ మేరకు చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు రాపోలు వీరమ్మోహన్ మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. రామన్నపేట పట్టణానికి చెందిన బూరుగు వెంకటేశం రామన్నపేట పట్టణ, మండల పద్మశాలి సంఘం ఏర్పాటు విషయంలో కీలకంగా వ్యవహరించడంతోపాటు సంఘ బలోపేతానికి సాయ శక్తుగా చేస్తున్నారు. చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా కొనసాగుతున్న ఆయనను క్రమశిక్షణ కమిటీ సభ్యులుగా నియామకం కావడంతో పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు రచ్చ యాదగిరి, డీసీఎంఎస్ మాజీ జిల్లా డైరెక్టర్, రామన్నపేట కాటన్ చేనేత సహకార సంఘం అధ్యక్షులు జెల్ల వెంకటేష్, పద్మశాలి సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి కైరంకొండ నాగభూషణ్, నాయకులు రవ్వ నరసింహ, రవ్వ సత్యనారాయణ, మహేశ్వరం అశోక్, నందు, చలమల గోపాల్ హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## యూనిటీ ఫార్మసీ కళాశాలలో ప్రాంగణ నియమకాలు



**ప్రజాపక్షం/భువనగిరి :** రాయగిరి గ్రామంలో గల యూనిటీ ఫార్మసీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అంపటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇటీవల ఫార్మసియుటికల్ కంపెనీల ప్రాంగణ నియామకాలు చేపట్టినారు. జోడాస్ ఫార్మసిటికల్ కంపెనీలో 12 మంది విద్యార్థులు, భారత్ బయోటెక్ కంపెనీలో 20 మంది విద్యార్థులు ఎన్నికయ్యారు. ప్రాంగణ నియామకాలలో ఎన్నికైనటువంటి విద్యార్థిని విద్యార్థులను కళాశాల చైర్మన్ ఏ. ప్రభాకర్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ గోవర్ధన్ రెడ్డి, పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంఎస్ సరిత, ఏవో సునీత డాక్టర్ మోహిని ఇస్మాయిల్, అనిత, అమర్నాథ్, రాజీవ్, ప్రియాంక అమూల్య పారిజాత, అహ్మద్, మహేష్, శ్వేత, మౌనిక, నాగరాజు, బాలరాజు పాల్గొన్నారు.

## విత్తన, ఎరువుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/నేరేడుగొమ్ము;** ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని మంగళవారం నేరేడుగొమ్ము మండల కేంద్రంలో జిల్లా వ్యవసాయ అధికారి, డివిజన్ వ్యవసాయ అధికారి, మండల వ్యవసాయ అధికారి సంయుక్తంగా విత్తన, ఎరువుల, పురుగుమందుల దుకాణాలను ఏఆర్ఎస్కే, ఎన్‌డిసిఎంఎస్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా విత్తన, ఎరువుల దుకాణాలలో స్టాక్ నిల్వలు, రిజిస్టర్లు, లైసెన్స్, బిల్ బుక్‌లను, విక్రయ రికార్డులను పరిశీలించారు. నకిలీ విత్తనాలు, గడుపు ముగిసిన, నాణ్యతలేని ఎరువులు, విత్తనాలు, పురుగులమందుల విక్రయాలపై అప్రమత్తంగా ఉండాలని డీలర్లకు సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన దుకాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# వెలగని వీధి దీపాలు.... అంధకారంలో గ్రామ ప్రజలు

### అధికారుల నిర్లక్ష్యం కారణంగానే వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తం



**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** మండల పరిధిలోని మాధారం గ్రామంలో ప్రజలు గాఢాంధకారంలో మరిచిపోతున్నారు. వీధుల్లో రాత్రంత వీధి దీపాలు వెలగక చీకటిలోనే అలమటిస్తున్నామని అక్కడ ప్రజలు ఆరోపిస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఈ సమస్య ప్రజల్ని పట్టిపీడిస్తున్న అధికారులకు ఏమీ పట్టడంలేదని అంటున్నారు. అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని ఆ వీధుల్లోని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో ఇళ్ల నుంచి బయటకు రావాలంటే కష్టం ఉంటుందని ఆయా వీధుల్లోని ప్రజలు వాపోతున్నారు. రాత్రి సమయంలో విష పురుగులు సంచారం అధికంగా ఉండటంతో పొద్దుగూకే సరికే ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఎవరికి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. కనీసం ఇంట్లో ఐనా ఉండటానికి కూడా అవకాశం లేకుండా చినుకు పడితే చాటు విద్యుత్ కోతలు అధికంగా ఉంటున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ పాలకవర్గం స్పందించి గ్రామంలో వీధి దీపాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# ద్విచక్ర వాహనాల దొంగలు అరెస్ట్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ ఒన్, టూ టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో 9 మోటార్ సైకిళ్ల దొంగతనాలకు పాల్పడ్డ ముగ్గురినీ అరెస్టు చేసినట్టు మిర్యాలగూడ ఒన్, టూ టౌన్ ఇన్స్పెక్టర్లు ఎం. నాగభూషణరావు, జె.సోమనర్సయ్యలు మంగళవారం తెలిపారు. స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో అరెస్టు చేసిన సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. నల్లగొండ మండలం ఆర్జాలబావికి చెందిన కొంగరి నవీన్ కుమార్, సూర్యాపేట జిల్లా పాలకీడు మండలం గుడుగుంట్లపాలెంకు చెందిన సోమిరెడ్డి సైదిరెడ్డి, దామరచర్ల మండలం వాడపల్లికి చెందిన కంచరకుంట్ల సుమలతలను అరెస్టు చేసినట్టు తెలిపారు. మంగళవారం ఉదయం వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా అనుమానస్పదంగా ఉన్న వారిని పోలీసులు ప్రశ్నించగా బైకులు దొంగతనం చేశామని ఒప్పుకున్నారని తెలిపారు. వారి నుండి రెండు మోటార్ సైకిల్లు, బైకులు అమ్మితే వచ్చిన రూ. 1.38 లక్షలు స్వాధీనం చేసుకున్నామన్నారు. దొంగతనం చేసిన బైకులను తక్కువధరకు కొనుగోలు చేసి విడిబాగాలు చేసి అమ్మినందుకు అరెస్టు చేశామని తెలిపారు. ఆమె నుండి రూ.1.38లక్షలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. డీఎస్పీ కె. రాజశేఖర్ రాజు ఆధ్వర్యంలో టూ టౌన్ ఇన్స్పెక్టర్ సోమనర్సయ్య, ఎఎస్ఐ షేక్ గఫ్ఫార్, హెడ్ కానిస్టేబుల్ ఆర్. స్వర్ణకుమార్, పీసీ పి. బాలకృష్ణ,జి. కళ్యాణ్, సూరా, బి. మణిదీప్, సయ్యద్ సమద్, ఎండి. అక్బర్ పాషా, ఎం. రామకృష్ణ, ఎస్. రాజశేఖర్, ఎం. లక్ష్మయ్యలు దొంగలను పట్టుకున్న సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ అభినందించారు.

# జిఓ నెంబర్ 4 తో మున్సిపల్ కార్మికులకు తీరని ద్రోహం




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రభుత్వ రంగ సంస్థలలో ఏళ్ల తరబడి శ్రమిస్తున్న మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయకుండా జీవోల పేరుతో వేతన దోపిడీకి పాల్పడుతున్నారని సిపిఎం రాష్ట్ర కమిటీ ప్రతినిధి డబ్బింగ్ కార్ మల్లేష్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో జరిగిన ఆయన పాల్గొని మాటాల్డారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ మున్సిపాలిటీలలో 65 వేల మంది కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ పద్ధతుల్లో చాలీచాలని జీతాలతో బతుకీడుస్తున్నారన్నారని అన్నారు. కార్మికుల హక్కుల రక్షణ కోసం ఈనెల 18, 19 తేదీలలో అన్ని మున్సిపాలిటీల ఎదుట నిరసన దీక్షలు చేపడుతున్నట్లు ప్రకటించారు. అప్పటికీ పాలకవర్గంలో చలనం రాకుంటే 22వ తేదీన జిల్లా కలెక్టరేట్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ మొండివైఖరి ఇలాగే కొనసాగితే 29, 30 తేదీల్లో ప్రజాప్రతినిధుల ఇళ్లను, ఎమ్మెల్యే, ఎంపీ కార్యాలయాలను దిగ్బంధిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సిపిఎం పట్టణ బాధ్యులు మల్లు గౌతంరెడ్డి, రామారావు, వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు మోహన్, సిహెచ్ వెంకన్న, మహిళా సంఘం నాయకురాలు పూలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# భూములు అమ్ముకుని చదివించాలా?




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ పట్టణ కేంద్రంలో పేద, మధ్యతరగతి ప్రజలకు చదువు అనేది ఎండమావిగా మారుతోందని, ప్రైవేట్ సంస్థల ఫీజుల దౌర్జన్యాలు రోజురోజుకు మితిమీరిపోతున్నాయని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ అన్నారు. మంగళవారం బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ప్రైవేట్ స్కూళ్లు కేవలం డబ్బు సంపాదనే ధ్యేయంగా అక్రమ వసూళ్లకు దిగుతున్నాయని ధ్వజమెత్తారు. షూస్, టై, బెల్ట్, యూనిఫామ్స్ వంటివన్నీ స్కూళ్లలోనే కొనాలంటూ తల్లిదండ్రులను బలవంతం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సామాన్యుల జీవితాలను దయనీయ స్థితిలోకి నెడుతున్న ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం తక్షణమే ఒక పాలసీని తీసుకురావాలని, లేనిపక్షంలో విద్యాశాఖ కార్యాలయాల ముట్టడికి సిద్ధమవుతామన్నారు. ఈ నిరసన సదస్సులో జేఏసీ నాయకులు దాసరాజు జయరాజ్, బీసీ యువజన విభాగం బాధ్యులు పట్టేటి రమేష్, మునగాల శైలేందర్, నాయిని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



## రేవూరులో దేవాలయ భూముల సర్వే

**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** మండల పరిధిలోని రేవూరు గ్రామంలో దేవాలయ ఈవోగా బాధ్యతలు చేపట్టిన నాగెళ్ల శంభిరెడ్డి శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానికి చెందిన వ్యవసాయ భూములను మంగళవారం సర్వే చేయించారు. సర్పంచ్, గ్రామ పెద్దలు, కౌలు రైతుల సమక్షంలో శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లోకల్ సర్వే ద్వారా భూముల హద్దులు, సర్వే నెంబర్లు విస్తీర్ణం గుర్తించారు. ఈ సందర్భంగా నాగెళ్ల శంభిరెడ్డి మాట్లాడుతూ దేవాలయ ఆస్తుల పరిరక్షణకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామంలోని శ్రీవేణుగోపాల స్వామి దేవస్థానం, రంగస్వామి దేవస్థానం, సిద్ది లింగేశ్వర స్వామి దేవస్థానం వ్యవసాయ భూముల కౌలురైతుల వివరాలు, కౌలు బకాయిల రికార్డులు సరిచూసి పారదర్శకంగా కౌలు బకాయి వసూలు నిర్వహిస్తామని చెప్పారు. దేవుడి మాన్యాలను కాపాడటం అందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గురవయ్య, దేవాలయ మాజీ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, గ్రామ పంచాయతీ పెద్దలు, కౌలు రైతులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

## ఫిట్నెస్ లేకుండా స్కూల్ బస్సులు నడిపితే కఠిన చర్యలు




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఫిట్నెస్ లేకుండా స్కూల్ బస్సులు నడిపితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని మిర్యాలగూడ మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ బి.వీరేంద్రనాయక్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని హనుమాన్‌పేట ఫ్లై ఓవర్ వద్ద తనిఖీలు చేపట్టగా ఒక ఫిట్నెస్ లేని స్కూల్ బస్సుపై కేసు నమోదు చేశామన్నారు. మిర్యాలగూడ రవాణా డివిజన్ పరిధిలో సుమారు 335 స్కూల్ బస్సులున్నట్టు గుర్తించామని వాటిలో ఇప్పటివరకు 258 బస్సులను పరిశీలించి ఫిట్నెస్ సర్టిఫికెట్ ఇచ్చామని ఆయన తెలిపారు. స్కూల్ యాజమాన్యం బస్సులకు ఫిట్నెస్ లేకుండా విద్యార్థులను తీసుకుని తిరిగితే కఠిన చర్యలు తప్పవని ఆయన అన్నారు. మిగిలి ఉన్న 77స్కూల్ బస్సులకు ఫిట్నెస్ సర్టిఫికెట్ తీసుకుని సురక్షితంగా విద్యార్థులను చేర్చాలని కోరారు. అదేవిదంగా బస్సులలో సామర్థ్యనికి మించి విద్యార్థులను ఓవర్ లోడ్‌గా ఎక్కించవద్దని కోరారు. కార్యక్రమంలో ఎఎంవిఐ అలీ, సిబ్బంది ఉన్నారు.

## కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలి

**ప్రజాపక్షం/చండూరు:** మున్సిపాలిటీలో పనిచేసే కార్మికులకు కనీస వేతనం 26వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు జేరిపోతుల ధనుంజయ్య గౌడ్ అన్నారు. మంగళవారం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యునియన్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చండూరు మున్సిపాలిటీ చైర్మన్ మల్లేశంకు వినతి పత్రం అందజేశారు. ఈ నెల 18,19 తేదీలలో మున్సిపాలిటీ కార్యాలయాల వద్ద నిరహార దీక్షలు చేయాలని ,జూన్ 27న జిల్లా కలెక్టర్ ఆఫీసుల ముందు ధర్నాలు చేయాలని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు మొగుదాల వెంకటేశం , చిట్టిమల్ల లింగయ్య , సిఐటియు నాయకులు కత్తుల సైదులు , బీపంగి నాగరాజు, యాదయ్య, రేణుక, కలమ్మ , జంగమ్మ ,వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



## ఆంజనేయస్వామికి పంచామృత అభిషేకాలు

ప్రజాపక్షం/నేరేడుచర్ల: పట్టణంలోని శ్రీకోదండ రామాలయంలో కొలువైన పవనసుతుడు ఆంజనేయ స్వామికి మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో పంచామృత అభిషేకాలు చేశారు. ఆలయ పూజారి కొలచిన దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో ఆవు, నెయ్యి, పెరుగు, పంచదార, గంధం వివిధ రకాల పండ్లతో అభిషేకాలు చేసి, వేదముద్రలతో ఆకుపూజ, పుష్పార్చన పూజలు చేశారు. ఆంజనేయ స్వామిని పూలమాలలతో పూలతో, తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ పూజ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సెఫ్టీ కిట్స్ పంపిణీ



ప్రజాపక్షం/అర్వపల్లి : మండలంలోని రామన్నగూడెం గ్రామంలో గ్రామ పంచాయితీ సిబ్బందికి సెఫ్టీ కిట్స్‌ను గ్రామ సర్పంచ్ కర్నాటి వెంకన్న మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వానాకాలంలో పారిశుద్ధ్య పనులకు ఆటంకం కలగకుండా ఈ సెఫ్టీ కిట్స్ సిబ్బందికి ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లింగంపల్లి రవీందర్, పంచాయితీ కార్యదర్శి సుధాకర్, వార్డు సభ్యులు నర్సింహ్మా, గంట రవి, తవిటి సైదులు, ముడావత్ తనేష్ పాల్గొన్నారు.

## నర్సింగ్ మంగమ్మ మృతి బిఆర్ఎస్‌కి తీరనిలోటు

ప్రజాపక్షం/గరిడేపల్లి: నర్సింగ్ మంగమ్మ మృతి బిఆర్ఎస్ పార్టీకి తీరనిలోటు అని మాజీ సింగిల్ విండో చైర్మన్ వీరంరెడ్డి శంభిరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పరెడ్డిగూడెం గ్రామానికి చెందిన నర్సింగ్ మంగమ్మ కొద్ది రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. ఈ సందర్భంగా ఆమె మృతదేహంపై పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలోబిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు గుగులోతు కృష్ణనాయక్, నర్సింగ్ రామకృష్ణ, బాలకృష్ణ, విజయ్, గారకుంటతండా సామాజిక సేవా కార్యకర్త నరేందర్‌నాయక్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక

ప్రజాపక్షం/బొమ్మలరామారం : మండలంలోని కంచల తండా గ్రామపంచాయతీలో కాంగ్రెస్ గ్రామ కమిటీలను మంగళవారం రోజున మండల పార్టీ అధ్యక్షులు బీర సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులుగా ధీరావత్ నరేందర్ నాయక్ అధ్యక్ష కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ శాఖ అధ్యక్షులు మాట్లాడుతూ తనపై నమ్మకంతో అవకాశం కల్పించినందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేష్ పైలెట్, మహిళా అధ్యక్షురాలు యంజాల కళ, సర్పంచ్ బేబీర మేష్ నాయక్, మాజీ మండలాధ్యక్షులు మల్లేశం, మాజీ జెడ్పిటిసి సభ్యులు రాజేశ్వర్ యాదవ్ ఉన్నారు.



## పోలీస్ స్టేషన్‌ను ఎస్‌పి ఆకస్మిక తనిఖీ



ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ : సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్‌పి కె. నరసింహ మంగళవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డుల నిర్వహణ, కేసుల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అధికారులకు, సిబ్బందికి పలు కీలక సూచనలు ఆదేశాలు ఇచ్చారు. బాధితులకు ప్రజలకు వేగవంతమైన పోలీస్ సేవలు అందించాలన్నారు. సంఘటనలపై సమాచారం అందుకున్న వెంటనే బాధితుల ఇళ్లకు వెళ్లి ఫిర్యాదులు స్వీకరించి కేసులు నమోదు చేయాలని సూచించారు. అర్ధరాత్రి వేళ గ్రామాల్లో రాత్రి బీట్ పోలీస్ సిబ్బంది పెట్రోలింగ్ సిబ్బంది సంచరిస్తూ ప్రజలకు, ప్రజల ఆస్తులకు భద్రత కల్పించాలన్నారు. వివిధ సమస్యలపై ఫిర్యాదులు చేయడానికి వచ్చిన బాధితులతో మాట్లాడి మరి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలపై సిబ్బంది వేగంగా స్పందించాలని ఆదేశించారు. డయల్ 100 ఫిర్యాదులపై అత్యంత వేగంగా స్పందించాలని, ముఖ్యంగా సంఘటనల గురించి సమాచారం అందిన వెంటనే బాధితుల వద్దకు వెళ్లి, వాటి నివాసాల నుండే ఫిర్యాదులు స్వీకరించి, అక్కడి నుండే కేసులు నమోదు చేసే విధానాన్ని పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణాను కఠినంగా నిరోధించాలని ఆదేశించారు. జాతీయ రహదారిపై భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని సూచించారు. రూరల్ సిఐ రాజశేఖర్, ఎస్ఐ బాలు నాయక్, సిబ్బంది ఉన్నారు.

## చలో కొడంగల్‌కు ఉద్యమకారులు తరలిరావాలి



ప్రజాపక్షం/కోదాడ: ఈనెల 28న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అధ్వర్యంలో నిర్వహించనున్న కొడంగల్ కృతజ్ఞత అభినందన యాత్రను విజయవంతం చేయాలని ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం కోదాడ పట్టణంలోని స్థానిక పబ్లిక్ క్లబ్ ఆవరణలో ఫోరం జిల్లా అధ్యక్షులు గుండెపంగు రమేష్ అధ్యక్షతన జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణ ఉద్యమకారులను ఆదుకునేందుకు కెకె కమిటిని ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. న్యాయం చేసే దిశగా ఈ కమిటి ప్రణాళికలు రచిస్తోందని హర్షం వ్యక్తం చేశారు. ఉద్యమకారుల గుర్తింపునకు చొరవ చూపిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపేందుకే ఈ అభినందన యాత్ర చేపడుతున్నామని, దీనికి ప్రతి ఒక్క ఉద్యమకారుడు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆవుల రామారావు, భూపాల్, జోగు అంజన్న, పుల్లూరి అచ్చయ్య తుపాకుల భాస్కర్, మజహర్, ఏనుగుల యల్లేశ్వరరావు, మట్టపల్లి శ్రీనివాసగౌడ్, పొలంపల్లి వెంకటేశ్వర్లు, సైదులు నాయక్, దావీద్, వీరబాబు, తొటపల్లి నాగరాజు, ఎస్‌కె బాజాన్, రామకృష్ణ, యాదగిరి, సత్యనారాయణ పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్తు

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ప్రైవేటు విద్యాసంస్థల మోసపూరిత ప్రకటనలను నమ్మి లక్షలాది రూపాయల ఫీజులు చెల్లిస్తూ అప్పులపాలు కాకుండా, ప్రభుత్వం కల్పిస్తున్న నాణ్యమైన ఉచిత విద్యా సౌకర్యాలను పేద మధ్యతరగతి కుటుంబాలు వినియోగించుకోవాలని విద్యుత్ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు మారం శ్రీనివాస్ మంగళవారం కోరారు. నేడు ఎల్కేజీ తరగతి నుంచే పైచదువుల వరకు ప్రైవేటు యాజమాన్యాలు లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లోకి నెదుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి తరుణంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో లభించే ఉచిత విద్యను ప్రతి ఒక్కరూ ఆదరించాల్సిన అవసరం ఉందన్నారు. మన బడిని కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజంలో ఉన్న ప్రతి పౌరుడిపై ఉందన్నారు.ప్రభుత్వ విద్యాసంస్థలలో అత్యంత ప్రతిభావంతులైన, ప్రభుత్వంచే అర్హత సాధించిన ఉపాధ్యాయులు బోధన అందిస్తున్నారని తెలిపారు. దీనితో పాటు విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం, ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నాణ్యమైన యూనిఫాం వంటి అన్ని రకాల మౌలిక వసతులను ప్రభుత్వం ఉచితంగా కల్పిస్తోందని వివరించారు. పిల్లల చదువుల ప్రతిభకు స్కూల్ పేరుతో ఎలాంటి సంబంధం ఉండదని, విద్యార్థి కష్టపడే తత్వాన్ని బట్టే ఫలితాలు ఉంటాయని తెలిపారు. మన బడి మన బాధ్యత అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ప్రభుత్వ బడులను బలపరిచేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

## రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ పొలిటికల్ కమిటీ ఉపాధ్యక్షులుగా నరసింహ



ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ : తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ పొలిటికల్ కమిటీ ఉపాధ్యక్షులుగా నల్లగొండ జిల్లాకు చెంది న నాయకులు సోమా నరసింహను నియమిస్తూమహాసభ రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా సోమానరసింహా మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తనను పొలిటికల్ కమిటీ ఉపాధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణకు అందుకు సహకరించిన తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు ఊరె లక్ష్మణ్ , తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ప్రచార కార్యదర్శి రాచమల్ల వెంకటేష్ తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అసోసియేట్ కార్యవర్గ సభ్యులు తెలుకుంట్ల జానయ్య నల్లొండ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు తెలుకుంట్ల చంద్రశేఖర్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి శెట్టి శ్రీనివాస్ లకు హృదయపూర్వక ధన్యవాదములు తెలియజేశారు. కాగా సోమనరసింహ నియామకం పట్ల పలువురు ఆర్యవైశ్య నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.



## రైతుల పేరుతో రాజకీయాలు తగదు

ప్రజాపక్షం/రామన్నపేట : రైతుల పేరుతో రాజకీయాలు చేయడం మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మానుకోవాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడు మాజీ ఎంపిటిసి ఎండి రేహాన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతుల సమస్యలపై అసత్య ప్రచారంచేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూడటం బాధాకరమన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, నకిరేకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ వేముల వీరేశం ధాన్యం కొనుగోళ్లను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని సమీక్షలు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు ఆదేశాలిస్తూ ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు అయ్యే విధంగా కృషి చేస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయన్నారు. ఈ సమావేశంలో డిసిసి కార్యదర్శి అబ్రహం కుమార్, పట్టణ అధ్యక్షుడు ఎండి జమీరుద్దీన్, మాజీ పిసిసి కార్యదర్శి గోదాసు పృథ్వీరాజ్, మాజీ ఎంపీటీసీ సాల్వేరు అశోక్, మాజీ డిసిసిబి డైరెక్టర్ జెల్లా వెంకటేశం పాల్గొన్నారు.

## నేడు పట్టణంలో బిఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: మిర్యాలగూడ పట్టణం నందిపహాడ్ టిఎన్ఆర్ గార్డెన్స్ లో మిర్యాలగూడ నియోజకవర్గ బిఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం ఈ నెల 17న నిర్వహించనునట్టు నియోజకవర్గం పార్టీ ఇంచార్జి మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో ఎస్ఐఆర్, డిజిటల్ సభ్యత్వ నమోదు, పార్టీ బలోపేతం భవిష్యత్ కార్యాచరణ పై సమగ్రంగా చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశానికి మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి, డిజిటల్ సభ్యత్వాల నమోదు ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్, మిర్యాలగూడ సభ్యత్వాల నమోదు ఇంచార్జ్ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీ ఎంసీకోటిరెడ్డి వస్తున్నారన్నారు. నియోజక వర్గంలోని అన్ని మండల, పట్టణ, గ్రామాల ముఖ్య నాయకులు బిఎల్ఏలు, సభ్యత్వ నమోదు ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు తప్పనిసరిగా సకాలంలో హాజరు కావాలని భాస్కర్ రావు కోరారు.

## విత్తనాలు విత్తే ముందు మెళకువలు

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో రైతులు విత్తనాలు విత్తే ముందు మెళకువలు పాటించాలని మిర్యాలగూడ మండల వ్యవసాయాధికారి ఎం. బుష్యేంద్రమణి అన్నారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ విత్తే ముందు క్రిములు సోకకుండా విత్తనాలు శుద్ధి చేయాలన్నారు. నేలలో తగినంత తేమ ఉన్నప్పుడే విత్తనాలు విత్తాలని విత్తనాల పరిమాణాలను బట్టి సాధారణంగా 2సెంటి 5సెంటి మీటర్ లోతుగా విత్తాలి. 5 సెంటి మీటర్ల లోతుగా విత్తితే మొలకెత్తిన అనంతరం నేలపైకి రావడానికి ఇబ్బందులుంటాయన్నారు. 2 సెంటి మీటర్ల తక్కువ లోతులో విత్తితే మొలకెత్తడానికి అవసర తేమ అందక మొలక శాతం తగ్గే అవకాశం ఉంటుందన్నారు. అందువల్ల విత్తనాలను సరైన లోతులో తగిన తేమ ఉన్న నేలల్లో జాగ్రత్తగా విత్తితే మంచి మొలకలు మంచి ఫలితాలు వస్తాయన్నారు.

## యువకుడి ఆత్మహత్య

ప్రజాపక్షం/రామన్నపేట :స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని దుబ్బాక గ్రామంలో ఒక యువకుడు మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ డి.నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. దుబ్బాక గ్రామానికి చెందిన కంబాలపల్లి అంజయ్య చిన్న కొడుకు కంబాలపల్లి సాయి చరణ్ (23) ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నాడు. ప్రస్తుతం ఎలాంటి పని చేయకుండా ఇంట్లోనే ఖాళీగా ఉంటున్నాడు. ఈ క్రమంలో, బాధ్యత లేకుండా తిరుగుతుండటంతో తండ్రి అంజయ్య కొడుకును ఏదైనా పని చూసుకోవాలని మందలించాడు.తండ్రి మాటలకు తీవ్ర మనస్తాపానికి గురైన సాయి చరణ్ సోమవారం రాత్రి సుమారు 08:30 గంటల సమయంలో ఎవరూ లేని తమ పాత ఇంట్లోకి వెళ్లాడు. అక్కడ చీరతో ఫ్యాన్కు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడని, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రామన్నపేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ డి. నాగరాజు తెలిపారు.



## ఎంపి చామలకు ఘన స్వాగతం

ప్రజాపక్షం/బీబీనగర్ : బీబీనగర్ ఎయిమ్స్ హాస్పిటల్ రివ్యూ మీటింగ్‌కి విచ్చేసిన భువనగిరి పార్లమెంటు సభ్యులు గౌరవనీయులు చామల కిరణ్ కుమార్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి పింగల్ రెడ్డి, పొట్టోల శ్యామ్ గౌడ్‌లు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసీ పంజాల వెంకటేశ్ గౌడ్, దండెం ప్రభాకర్, సామల ప్రవీణ్ రెడ్డి, కాసుల రఘునందన్ గౌడ్, ఎండీ.మోయిన్, తుమ్మల నరసింహ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు బద్దం వాసుదేవ రెడ్డి, కొలను నిఖిల్ రెడ్డి పాల్గొన్నారు

## పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి



ప్రజాపక్షం/నడిగూడెం: గ్రామంలో పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు సర్పంచ్ దున్న శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం నడిగూడెం మండల కేంద్రంలో 1వ వార్డులో రోడ్డు వెడల్పు కార్యక్రమంలో దెబ్బతిన్న డ్రైనేజీ క్యల్వర్టు పనులను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని, ప్లాస్టిక్ బాటిల్‌లు, కవర్‌లు ఇతర వస్తువులు డ్రైనేజీ కాలువలో వేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు దున్న లింగయ్య, దున్న శ్రీకాంత్, దున్న మనీషా, దాసరి శ్రీను, దోసపాటి వెంకన్న, దున్నప్రవీణ్, దున్న శ్రీను, సందీప్ పాల్గొన్నారు.

## గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాపక్షం/నకిరేకల్ : లయన్స్ క్లబ్ ఆఫ్ శాలిగౌరారం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు.లయన్స్ క్లబ్ మల్టిపుల్ కౌన్సిల్ ఫస్ట్ వైస్ ఛైర్పర్సన్, జిల్లా ఫస్ట్ గవర్నర్, ప్రముఖ న్యాయవాది, జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ పిఎంజెఎఫ్ లయన్ గోలి అమరేందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా శాలిగౌరారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీ మహిళలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు.గర్భిణీస్త్రీల ఆరోగ్యం, పోషకాహారం పట్ల అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని లయన్స్ ప్రతినిధులు తెలిపారు. ఈకార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ ఛైర్మన్ బుడిగె శ్రీనివాసులు,డీసీ మెంబర్ దెంకల సత్యనారాయణ, సింగిల్ విండో సీఈఓ నిమ్మల ఆంజనేయులు, మండల వైద్యాధికారిణి డాక్టర్ సూర్య శిల్ప, క్లబ్ ప్రధాన కార్యదర్శి దామెర్ల శ్రీనివాస్,గుండు పరమేష్, క్లబ్ గౌరవ సలహాదారులు రాముడుగు వెంకటరామ శర్మ, క్లబ్ సభ్యులు కప్పల శ్రీకాంత్,వైద్య సిబ్బంది మరియా పాల్గొన్నారు.



## ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అధ్యక్షుడిగా కేమ విష్ణు



ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : పోచంపల్లి మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మండల నూతన కార్యవర్గ ఎన్నికలో అధ్యక్షునిగా కేమ విష్ణు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక ధనలక్ష్మి ఫంక్షన్ హాల్ లో ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యాదాద్రి భువనగిరి జిల్లా ఫోటో అండ్ వీడియోస్ గ్రాఫర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షులు భోగచంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.నూతన కార్యవర్గం చే ప్రమాణ స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించి. అనంతరం జిల్లా ఒకే ధరల పట్టిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామన్న పేటలో ఇటీవల ప్రమాదంలో మరణించిన ఫోటోగ్రాఫర్ నకిరికంటి మహేష్ కు కమిటీ త్వరలోనే రూ 4.10 లక్షలు కుటుంబ భరోసా పేరిట అందించనుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం మాజీ అధ్యక్షుడు దోర్నాల గణేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఉపాధ్యక్షులు చెక్క మల్లేష్, ప్రధాన కార్యదర్శి రవ్వ నవీన్, కోశాధికారి సకినాల సిద్దేశ్వర, సహాయ కార్యదర్శి దొడ్డ మోని వంశీధర్, కార్యవర్గ సభ్యులుగా ఎర్వ విగ్నేశ్వర్, వంగూరి నరేష్, తవటం ఉమాకాంత్, పొట్టపర్తిని కృష్ణ, పెద్దిరెడ్డి వెంకటేష్, బేతి నిఖిల్ లను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చిల్ల హరి రెడ్డి, కోశాధికారి తూనిక దశరథ, ఉపాధ్యక్షులు ఎర్రోజు యజ్ఞమాచారి, జిల్లా గౌరవ సదరుదారులు వల్లంశెట్టి సతీష్, జిల్లా సలహాదారులు రచ్చ వెంకటేష్, సహాయ కార్యదర్శి చింతల రామకృష్ణ పాల్గొన్నారు.

## ప్రీ స్కూల్ పిల్లలకు ఉచితంగా యూనిఫాంల పంపిణీ



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ప్రైవేట్ కాన్వెంట్ల మోజులో పడి వేలాది రూపాయలు వృథా చేసుకోవద్దని, ప్రభుత్వ అంగన్‌వాడీ కేంద్రాలలోనే సకల వసతులతో కూడిన సంరక్షణ లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్వైజర్ కె. నాగమణి అన్నారు. ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్ట్ సీడీపీఓ పి. వేణుగోపాల్ రావు ఆదేశాల ప్రకారం పట్టణ వ్యాప్తంగా ఈ నెల 19 వరకు అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ఇస్లాంపుర సెక్టార్, గాంధీనగర్ సెక్టార్, ఈదులగూడ అంగన్వాడీ కేంద్రాల్లో ప్రత్యేక ప్రవేశాల అవగాహన సదస్సులు నిర్వహించారు. నెహ్రూనగర్1, అహమ్మద్ నగర్2 అంగన్వాడీ కేంద్రాల సిబ్బంది కలిసి బస్తీలలో పెద్ద ఎత్తున ప్రదర్శనలు చేశారు. ఫీజుల భారం లేని అంగన్‌వాడీ కేంద్రాల వైపు తల్లులు మొగ్గు చూపాలని కోరుతూ వీధుల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ బొంద పార్వతి, ఎండీ. షాహిన్ మున్నిసా బేగం, పి. యాదమ్మ, సహాయకులు లక్ష్మమ్మ, ఉమా, లక్ష్మి, హారిక, రాధ, ఉష, లలిత, నాగమణి, కరీమున్నిసాబేగం, చిన్నారుల తల్లిదండ్రులు, వార్డు పెద్దలు పాల్గొన్నారు.

## విద్య వ్యాపారీకరణపై ప్రభుత్వం చర్య తీసుకోవాలి

ప్రజాపక్షం/రామన్నపేట : మండలంలోని పలు ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను ఒక వ్యాపారంగా మార్చేసి, ఫీజుల పేరిట విద్యార్థుల తల్లిదండ్రులను పీల్చి పిప్పి చేస్తున్నాయని బిఆర్‌ఎస్వి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చినపాక రమేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ స్కూళ్లపై ప్రభుత్వ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని మెజారిటీ ప్రైవేట్ పాఠశాలల్లో కనీస వసతులు కరువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.రానున్నది వర్షాకాలం అయినప్పటికీ, పలు స్కూళ్లలో ప్రీప్రైమరీ తరగతులను రేకుల షెడ్లలోనే నిర్వహిస్తున్నారని, దీనివల్ల చిన్నారి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడే ప్రమాదం ఉందన్నారు. అరకొర వసతులు, అర్హతలేని బోధనాసిబ్బందితో విద్యాసంస్థలను నడిపిస్తూ, కేవలం డబ్బులు వసూలు చేయడమే ధ్యేయంగా పెట్టుకున్నారని మండిపడ్డారు. ఫీజుల కోసం తల్లిదండ్రులను నానా ఇబ్బందులకు గురిచేసే ఇలాంటి ప్రైవేట్ విద్యాసంస్థల గుర్తింపు తక్షణమే రద్దు చేయాలి. అన్ని రంగాలలో నైపుణ్యం,అర్హత కలిగిన ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉన్న సర్కారు బడుల వైపు పిల్లలను మళ్లించేలా విద్యాశాఖ అధికారులు చొరవ చూపాలని ఆయన కోరారు.

## సామూహిక అక్షరాభ్యాసం

ప్రజాపక్షం/నకిరేకల్ :మండలంలోని చందంపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రొఫసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రీ ప్రైమరీ, మొదటి తరగతిలో చేరిన విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు కనుకుంట్ల నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు వేదాంతం ఆదిత్య, భూపతి అనిత, వెల్మకంటి శ్రీహరి, ఎస్. అమరలింగాచారి, సీహెచ్. వరలక్ష్మి, ఎన్. రమణశ్రీ విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. పాఠశాలలో ఎల్‌కేజీ నుంచి ఏడో తరగతి వరకు ఆంగ్ల మాధ్యమంలో బోధన కొనసాగుతోందని, మండల స్థాయిలో ప్రాథమిక భాషా, గణిత సామర్థ్యాల అమలుకు ఎంపికైన పాఠశాలగా గుర్తింపు పొందిందని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



## రైతులు రిజిస్ట్రేషన్ నమోదు తప్పనిసరి

### మండల వ్యవసాయ అధికారి సన్నీ రాజ్

ప్రజాపక్షం/తిప్పర్తి : వ్యవసాయ శాఖ నుండి పొందే రైతు భరోసా, పిఎం కిసాన్, ముఖ్యంగా యూరియా పొందాలంటే రైతులు రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని తిప్పర్తి మండల వ్యవసాయ అధికారి సన్నీ రాజ్ అన్నారు. తెలంగాణ రైతు భరోసా పథకం కింద కొత్తగా భూమి పొందిన లేదా పేర్లను నమోదు చేసుకోవాలనుకునే రైతులు తమ ఆధార్ కార్డు. పట్టా పాసు పుస్తకం. బ్యాంకు అకౌంట్ వివరాలతో మీ సమీప వ్యవసాయ అధికారిని. లేదా రైతు వేదికను సంప్రదించాలని కోరారు.ప్రతి పథకానికి రైతులు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలని అన్నారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ లేకుండా ప్రభుత్వ పథకాలు, రాయితీలు పొందలేరు అని ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసి నమోదు చేసుకొని పథకాలు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ. సంతోషి. రజిత. గోపి ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రజాపక్షం/నార్కట్‌పల్లి : మండలంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు.సోమవార రాత్రి సుమారు 10 గంటల సమయంలో జిందాల్ ఫ్యాక్టరీ సమీపంలో చోటుచేసుకుంది.ఏపీ లింగోటం గ్రామానికి చెందిన పల్లగొర్ల లింగయ్య (50) వృత్తి వ్యాపారం, తన వ్యక్తిగత పనుల నిమిత్తం నార్కట్‌పల్లి గ్రామానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి టిజి 05బిఎ 2063 నంబర్ గల ఎలక్ట్రిక్ స్కూటర్‌పై వెళ్తున్నాడు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు వెనుక నుంచి లింగయ్య స్కూటర్‌ను ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో లింగయ్య తలకు తీవ్ర గాయం కావడంతో పాటు ఎడమ చేతికి బలమైన గాయాలు తగిలి లింగయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య పల్లగొర్ల నాగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి. విష్ణుమూర్తి తెలిపారు.

## వరి 8 రకాలను సాగు చేస్తే వానాకాలం బోనస్

ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం : రాష్ట్రంలో వానకాలం సీజన్లో రైతులను నాణ్యమైన వరి సాగు వైపు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎంపిక చేసిన 8 వరి రకాలను సాగు చేసిన రైతులకు బోనస్ అందించేలా చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జిల్లా స్థాయి వ్యవసాయ అధికారులకు ప్రత్యేక మార్గదర్శకాలు పంపినట్లు సమాచారం. రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా అధిక దిగుబడి నాణ్యమైన బియ్యం ఉత్పత్తి చేసే వరి రకాలను రైతులు సాగు చేసేలా అవగాహన కల్పించుటకు ప్రభుత్వం ఆదేశాల మేరకు మండల వ్యవసాయ అధికారిని బి పూజ రైతులను కోరారు. బోనస్ పథకం ద్వారా రైతులు ప్రోత్సాహం పొందడం పాటు మార్కెట్లో నాణ్యమైన ధాన్యం లభించే అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు.

## పోలీస్ అమరుల త్యాగాలు వెలకట్టలేనివి



ప్రజాపక్షం/నిడమనూరు: శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని స్థానిక ఎస్ఐ డి విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం నిడమనూరు మండల కేంద్రానికి చెందిన పోలీస్ అమరుడు ఉన్నం చెన్నకేశవులు 23 వర్ధంతి కార్యక్రమాన్ని నిడమనూరు పోలీస్ స్టేషన్లో నిర్వహించారు, సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ డి విజయ్ కుమార్ మాట్లాడుతూ కూంబింగ్లో భాగంగా మావోయిస్టుల మందుపాతరకు బలైన చెన్నకేశవులు త్యాగం వెలకట్టలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నకేశవ యూత్ క్లబ్ అధ్యక్షులు ఉన్నం ఈశ్వర్ ప్రసాద్, టిఆర్ఎస్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి నల్లబోతు వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది వెంకటేశ్వర్లు,రమేష్ నాయక్, నగేష్, ఆంజనేయులు, మహేష్ ,అప్పారావు, శ్రీనివాస్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ఇబ్రాహీంపూర్ గ్రామశాఖ ప్రధాన కార్యదర్శిగా సాయికుమార్

ప్రజాపక్షం/తుర్కపల్లి : తుర్కపల్లి మండలంలోని ఇబ్రాహీంపూర్ గ్రామంలో జిల్లా డీసీసీ అధ్యక్షులు, ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆదేశానుసారం మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖల ఎన్నికలో గ్రామానికి చెందిన గుజ్జుల సాయికుమార్ గ్రామశాఖ ప్రధానకార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఈ సందర్భంగా తన ఎన్నికకు సహకరించిన ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు, నాయకులు శంకర్ నాయక్‌కు, గ్రామ సర్పంచ్ మన్నెపు రజితతిరుపతిరెడ్డి, ఉపసర్పంచ్ నాగాయపల్లి శివరాములు, గ్రామ శాఖ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి, మండల నాయకులకు, ధన్యవాదాలు తెలిపారు. ఇబ్రాహీంపూర్ గ్రామంలో అటు మండలం, ఇటు గ్రామ నాయకత్వం సమన్వయంతో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మరింత కృషిచేస్తానని సాయికుమార్ తెలిపారు.

# గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

## పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య శంకుస్థాపన



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో మంగళవారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్ఏ బీర్ల అయిలయ్య పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయడం జరిగింది. ఈసందర్భంగా మండలకేంద్రం లోని గ్రామాభివృద్ధికి దోహదపడే పలు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. మండల కేంద్రంలో పప్పు ప్రాసెసింగ్ యూనిట్‌తో పాటు ఆహార ధాన్యాల నిల్వ గోదాము నిర్మాణానికి, మహిళా సంఘం భవన నిర్మాణానికి, సిసి రోడ్ల నిర్మాణానికి, పీర్ల కొట్టం నిర్మాణానికి ఎంఎల్ఏ బీర్ల అయిలయ్య శంకుస్థాపన చేశారు. పనులు పూర్తి అయితే ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో పాటు గ్రామీణ ఆర్థికాభివృద్ధికి కూడా తోడ్పాటు అందుతుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేవంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్దే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నారని అన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని సురక్షితంగా నిల్వ చేసేందుకు గోదాముల నిర్మాణం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, పప్పు ప్రాసెసింగ్ కేంద్రం ద్వారా స్థానిక రైతులకు అదనపు ఆదాయం లభించే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. మహిళలు ఆర్థిక, సామాజిక సాధికారత కోసం మహిళా సంఘాలకు ప్రత్యేక భవనాలు నిర్మించడం మరింత బలోపేతం కావడానికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తోందని తెలిపారు. అలాగే గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణం ద్వారా రవాణా సౌకర్యాలు మెరుగుపడి ప్రజలకు ఇబ్బందులు తొలగిపోతాయని అన్నారు. పీర్ల కొట్టం నిర్మాణం ద్వారా స్థానిక ప్రజల ఆధ్యాత్మిక, సాంస్కృతిక అవసరాలు తీర్చబడతాయని పేర్కొన్నారు. గ్రామాల సమగ్రాభివృద్ధి కోసం అవసరమైన ప్రతి పనిని దశలవారీగా పూర్తి చేస్తామని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఎప్పుడూ ముందుంటామని ఎంఎల్ఏ స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, రైతులు, గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఫీజుల పట్టికను నోటీస్ బోర్డులో పెట్టాలి.. పుస్తకాలు విక్రయిస్తే చర్యలు



**ప్రజాపక్షం/నకిరేకల్ :** ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని నకిరేకల్ మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) మేక నాగయ్య హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో పట్టణంలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో నిర్వహించిన సమావేశంలో 2026/27 విద్యా సంవత్సరానికి సంబంధించిన మార్గదర్శకాలను వివరించారు. ప్రతి పాఠశాల తమ గవర్నింగ్ బాడీ నిర్ణయించిన ఫీజుల వివరాలను నోటీసు బోర్డుపై ప్రదర్శించాలని, పాఠశాల పేర్లతో పుస్తకాలు, నోట్‌బుక్కులు, బ్యాగులు విక్రయించరాదని స్పష్టం చేశారు. పాఠశాల బస్సులకు చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలని, సంబంధిత ప్రతులను ఎంఆర్‌సీ కార్యాలయానికి సమర్పించాలని ఆదేశించారు.ఫిట్‌నెస్ లేని బస్సులను నడపరాదని, డ్రైవర్లకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కించకుండా బస్సుల్లో అటెండర్లను నియమించి విద్యార్థులను సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అడ్మిషన్ల కోసం ఉపాధ్యాయులకు లక్ష్యాలు నిర్దేశించి ఒత్తిడి చేయరాదని, అర్హత లేని ఉపాధ్యాయులతో బోధన నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సెలవు దినాల్లో తరగతులు నిర్వహించరాదని స్పష్టం చేశారు. విద్యారంగ అభివృద్ధికి ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాల బాధ్యులు. మారుపాక నరసయ్య, బి కన్నయ్య గౌడ్, సిహెచ్ కృష్ణ ,నాగరాజు,జితేందర్ రెడ్డి,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## టూరిజం రంగంపై పెరుగుతున్న ఆసక్తి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం మేనేజ్‌మెంట్ కళాశాల ఎంబిఏ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్ విభాగానికి చెందిన 7 మంది విద్యార్థులు ప్రఖ్యాత రామోజీ ఫిల్మ్ సిటీలో 52 రోజుల ఇంటర్న్‌షిప్‌ని విజయవంతంగా పూర్తి చేశారు. మంగళవారం విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఇంటర్న్‌షిప్‌లో వారు టూరిజం విభాగంలోని గెస్ట్ రిలేషన్స్, ఎంటర్‌టైన్‌మెంట్ మేనేజ్‌మెంట్, మెర్చండైజింగ్ ఆపరేషన్స్ తదితర విభాగాల్లో శిక్షణ పొందారని తెలిపారు.రామోజీ ఫిల్మ్ సిటీ వంటి ఖ్యాతిగాంచిన పర్యాటక కేంద్రంలో మా విద్యార్థులకు అవకాశం లభించడం విశేషమని విభాగాధిపతి డా. జక్కా సురేష్ రెడ్డి తెలిపారు.ఈ అనుభవం ద్వారా విద్యార్థులు పర్యాటకుల ఆతిథ్య సత్కారం,ఈవెంట్ థీమ్ పార్క్ నిర్వహణ, సేల్స్ మెర్చండైజింగ్ అంశాలపై తమ నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకున్నారని అన్నారు.విభాగాధిపతి డాక్టర్ జక్కా సురేష్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆర్థిసాంృతిక అభివృద్ధిలో టూరిజం రంగ ప్రాముఖ్యతను విశదీకరించారు. చారిత్రక, సాంృతిక, ఆధ్యాత్మిక, ఎకో టూరిజం తో పాటు ఫిల్మ్ ఎంటర్‌టైన్‌మెంట్ టూరిజం రంగాల్లో తెలంగాణకు అపారమైన అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. టూరిజం రంగంపై పెరుగుతున్న ఆసక్తి నేపథ్యంలో ఎంబీఏ టిటిఎం వంటి కోర్సులు విద్యార్థులకు టూర్ ఆపరేషన్స్, ట్రావెల్ ఏజెన్సీలు, ఈవెంట్ మేనేజ్‌మెంట్, హోటల్ రిసార్ట్ మేనేజ్‌మెంట్, ఎయిర్‌లైన్ ఎయిర్‌పోర్ట్ సేవలు, థీమ్ పార్క్ ఫిల్మ్ టూరిజం వంటి విభిన్న రంగాల్లో విస్తృతమైన ఉద్యోగావకాశాలు, స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయని పేర్కొన్నారు.

## ఘనంగా రెడ్ క్రాస్ చైర్మన్ గోలి అమరేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** జిల్లా రెడ్ క్రాస్ భవనంలో జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ లయన్ డాక్టర్ గోలి అమరేందర్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.జిల్లా రెడ్ క్రాస్ ట్రెజరర్ యూత్ కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో అమరేందర్ రెడ్డిని శాలువాతో సత్కరించి,కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఇంతమంది పెద్దల సమక్షంలో తన జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు.తాను చేపడుతున్న సేవా కార్యక్రమాలకు ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, బంధుమిత్రులు అందిస్తున్న సహకారం మరువలేనిదని పేర్కొన్నారు.తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు,రిటైర్డ్ ప్రిన్సిపాల్ మందడి నర్సిరెడ్డి,డే కేర్ సెంటర్ పెద్దలు,రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చల్లేటి ప్రభాకర చారి, నాగిరెడ్డి నవీన్, మేనేజింగ్ కమిటీ సభ్యురాలు సూరెడ్డి సరస్వతి,లయన్స్ క్లబ్ సభ్యులు వెంకటేశ్వర్లు, సత్యనారాయణ,నేతి విప్లవ్ కుమార్, క్లబ్ సభ్యులు సత్యనారాయణ, శ్రీనివాస్,రెడ్ క్రాస్ యూత్ వాలంటీర్లు అంజయ్య, రాము, సాయి,రెడ్ క్రాస్ సిబ్బంది సద్దాం హుస్సేన్,శ్రీనివాస్, ప్రభాకర్, పి.కృష్ణ, రఘునాథం, దుర్గారావు, యాదగిరి పాల్గొన్నారు.



## సాయి సన్నిధిలో ప్రవీణ్‌కుమార్

**ప్రజాపక్షం/చింతపల్లి :** బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మంగళవారం బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవరకొండలో జరిగిన ప్రత్యేక ఓటర్ జాబితా పరిశీలన, బిఆర్ఎస్ పార్టీ డిజిటల్ సభ్యత్వాలపై దేవరకొండ నియోజక వర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మార్గ మాధ్యలో చింతపల్లి మండల కేంద్రంలో ఆగి మొదటగా అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. తదనంతరం మండల కేంద్రంలో కొలువుదీరిన శిరిడి సాయిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రవీణ్‌కుమార్‌కు ఘన స్వాగతం పలికి, శాలువా తో ఘనంగా సన్మానించి, బాబా చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకటరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడుదొంతం చంద్రశేఖర్‌రెడ్డి, మండల ప్రచార కార్యదర్శి వింజమూరి రవి, నాయకులు అండేకర్ అశోక్, పూల యాదయ్య, ఆలయ కమిటీ సభ్యులు తడకమళ్ళ శ్రీనివాస్, కుంభం పుల్లారెడ్డి, కొమరిశెట్టి వెంకటయ్య, ఊరే కృష్ణయ్య, బిఆర్ఎస్ నాయకులు ఆరెకంటి రాధాకృష్ణ, ముదిగొండ మొగిలి, నల్లవెల్లి సంజీవ, శంకర్, వెంకటయ్యపాల్గొన్నారు.

## మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా అంజయ్యగౌడ్

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షునిగా జూలూరు గ్రామ సర్పంచ్ కాసుల అంజయ్య గౌడ్ ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన ఫోరం కమిటీలో ఉపాధ్యక్షులుగా మచ్చ శ్రీనివాస్ వంకమామిడి ఫకీర్ లత నర్సిరెడ్డి పెద్దగూడెం, ప్రధాన కార్యదర్శిగా దుర్గం జంగయ్య యాదవ్ దేశిముఖి, కార్యదర్శిగా యాట జంగ య్య దోతిగూడెం కోశాధికారిగా బొక్క మల్లా రెడ్డి శివారెడ్డి గూడెం, సహాయ కార్యదర్శిగా గోరుకంటి సువర్ణ రవీందర్ దంతూర్‌లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఉప్పునూతల వెంకటేష్ యా దవ్ , డీసీసీ ఉపాధ్యక్షులు కళ్ళేం రాఘవ రెడ్డి వివిధ గ్రామల సర్పంచ్ లు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణా నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు

**ప్రజాపక్షం/అర్వపల్లి :** అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజి రాంబాబు, ఎస్ఐ మహమ్మద్ అన్నారు. మంగళవారం జాజిరెడ్డిగూడెంలో మన ఇసుక మన వాహనంలో నడుస్తున్న ఇసుక ట్రాక్టర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుక రవాణా చేయాలన్నారు. అలాగే ప్రభుత్వ ప్రాజెక్టులకు వెళ్తున్న ఇసుక లారీలు పరిశీలించారు. అలాగే కాంటాలను తనిఖీ చేశారు. ఏవరైనా అధిక లోడ్లతో వెళ్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఎవరైనా ఉల్లంఘిస్తే వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుల్ పాషా, సిబ్బంది పాల్గొన్నారు.

